
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 23 అక్టోబరు 2024

ఆమనగల్లు ఏఎంసీ చైర్మన్‌గా గీత!

వైస్ చైర్మన్‌గా

గూడూరు భాస్కర్‌రెడ్డి!

నేడో, రేపో వెలువడనున్న

అధికారిక ఉత్తర్వులు

8



యాట గీత



భాస్కర్‌రెడ్డి

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర

కో-ఆర్డినేటర్ సురేశ్‌కుమార్

యాచారంలో

అవగాహన సమావేశం

7



గుంతల రోడ్డుతో నరకయాతన

భారీ వాహనాల

రాకపోకలతో ధ్వంసం

అధ్వానంగా

నందిగామ-వీర్లపల్లి రహదారి

వాహనదారులు,

ప్రజలకు ఇబ్బందులు

8



టీచర్ల అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

అవసరమైతే వలంటీర్లను నియమించాలి

సోషలిస్టు విద్యార్థి సంఘం

రాష్ట్ర కో-ఆర్డినేటర్ శంకర్

8



మాట్లాడుతున్న శంకర్



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

'చలో ఇందిరాపార్క్'ను విజయవంతం చేయాలి

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నేడు చలో ఇందిరా పార్కును నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు అన్నారు. జిల్లా కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం నేడు ఇందిరాపార్కు వద్ద ధర్నా గ్రహదీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 28న తహసీల్దార్లకు వినతి పత్రం సమర్పించనున్నట్లు అలాగే నవంబర్ 5వ తేదీన కలెక్టరేట్ల వద్ద నిరసన చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీహరికృష్ణ, బాలాపూర్ బాధ్యులు రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాచారంలో మోస్తరు వర్షం

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాచారం, ఇబ్రహీంపట్నంలలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. యాచారంలో రోడ్లపై వరద నీటితో జనం ఇబ్బంది పడ్డారు. కాగా, వర్షం కారణంగా చేతికందిన పత్తి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనాదారులు రోడ్డు పక్కన చెట్ల కింద తలదాచుకున్నారు.

అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రులు	09
ఉండాల్సిన సిబ్బంది	333
ప్రస్తుత సిబ్బంది	236
ఖాళీలు	97



రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి

ఉమ్మడి జిల్లాలో ఏ ప్రభుత్వ ఆస్పత్రి చూసినా ఏమున్నది గర్వకారణం అన్న పరిస్థితి నెలకొంది. ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసినా వసతులు, సిబ్బంది ఏర్పాటును మరిచారు. వేధిస్తున్న సిబ్బంది, వైద్యుల కొరతతో సకాలంలో వైద్యం అందక పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. స్థాయి పెరిగిన తొమ్మిది ఆస్పత్రుల్లో మొత్తం 333 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 236 మంది మాత్రమే ఉన్నారు. కమ్యూనిటీ ఆస్పత్రులు ఏరియా ఆస్పత్రులుగా మారినా వసతుల లేమి వెక్కిరిస్తోంది. నిధులు మంజూరైనా పలు చోట్ల ఆస్పత్రుల భవన నిర్మాణాలు ప్రారంభం కాని దుస్థితి. చాలా చోట్ల గైనకాలజిస్టులు లేక గర్భిణులు ప్రైవేట్‌కు పరుగులు తీస్తున్నారు.

అప్‌గ్రేడ్ సరే.. వసతులేవి?

ఆస్పత్రుల స్థాయి పెంచినా సౌకర్యాలు నిల్

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- అందుబాటులో లేని గైనకాలజిస్టులు
- గర్భిణులకు స్కానింగ్ కష్టాలు.. ప్రైవేట్‌కు పరుగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- చేవెళ్ల ఆస్పత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్
- నిధులున్నా ప్రారంభం కాని ఆస్పత్రి నిర్మాణాలు
- అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, వైద్యం అందుతున్న తీరుపై ప్రత్యేక కథనం



షాద్‌నగర్ ఆస్పత్రిలో రోగుల కిటకిట

ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంచినా వైద్య సిబ్బంది ఉన్న చోట సౌకర్యాలు లేవు.. సౌకర్యాలు ఉన్న చోట సిబ్బంది కొరత వేధిస్తుంది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రాంతీయ ఆస్పత్రి స్థాయికి ఎదిగినా ఆ మేరకు సిబ్బంది కనిపించని దుస్థితి. 100 పడకల సామర్థ్యం ఎక్కడా కనిపించడం లేదు. కమ్యూనిటీ ఆస్పత్రులను ఏరియా ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసినా అది ఆగితాలకే పరిమితమైంది. కొత్త ఆసుపత్రి భవనాల నిర్మాణం కోసం రూ.కోట్లు మంజూరైనా స్థల సేకరణ జరగక నిధులు మూలుగుతున్నాయి. గైనకాలజిస్టులు అందుబాటులో లేక నార్మల్ డెలివరీల సంఖ్య భారీగా తగ్గింది. అల్ట్రాసౌండ్ మిషన్ లేక పోవడంతో హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. ఒక వేళ స్కానింగ్ మిషన్ ఉంటే.. రేడియాలజిస్టు

మిగతా 7వ పేజీలో...

అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ రాస్తున్న అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష తీరును ఆయన పరిశీలించారు. దివ్యాంగ అభ్యర్థులకు సహాయకులు పరీక్ష రాస్తున్న విధానాన్ని, అలాగే పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు సునీత, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులున్నారు.

చేవెళ్లలో పరీక్ష కేంద్రాల తనిఖీ

చేవెళ్ల : మొయినాబాద్ మండల పరిధిలో ఆయా ఇంజనీరింగ్ కళాశాలల్లో గ్రూప్-1 మెయిన్స్ నిర్వహిస్తున్న కేంద్రాల్లో రెండో రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కేజీరెడ్డి కళాశాల 'ఏ' సెంటర్‌లో మొత్తం 600 మంది అభ్యర్థులకుగాను 368 మంది అలాగే ఆ కళాశాల 'బీ' సెంటర్‌లో మొత్తం 600 మందికిగాను 358 మంది పరీక్ష రాశారు. విద్యాజ్యోతి కళాశాలలో 984 మంది అభ్యర్థులకుగాను 602 మంది, జెబిఐటీ కళాశాలలో 816 మంది అభ్యర్థులకుగాను 464 మంది పరీక్షకు హాజరయ్యారు. కాగా, మంగళవారం పరీక్ష కేంద్రాలను మొయినాబాద్, చేవెళ్ల తహసీల్దార్లు గౌతమ్, కృష్ణయ్యలు పరిశీలించారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.




పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అధిక సాంద్రత పత్తి సాగుతో లాభాలు

- వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రకాంత్

మంచాల, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే దిగుబడి పెరిగి లాభసాటిగా ఉంటుందని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రకాంత్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఏ.ఆర్.రెడ్డి రైతులకు సూచించారు. కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ-హైదరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో మంచాల మండల పరిధి చిత్తాపూర్‌లో మంగళవారం అధిక సాంద్రత విధానంలో సాగు చేసని పత్తి సాగులో క్షేత్ర పరిశీలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఈ పద్ధతి సాగుతో 20-30 శాతం మేర దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం మంచాల రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పత్తి, కంది సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహరావు, ఏడీఏ సుజా, వ్యవసాయ శాస్త్రవేత్తలు భాస్కరన్, డా.షేక్, ఎస్.మీరా, కేవీకే సైంటిస్ట్ శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారిణి మాధవీలత, ఏఈవోలు సాయిసిరి, సాయివాణి, లింగస్వామి, రైతు సంఘం చైర్మన్ సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొర్విచెడ్‌లో నాపరాయితో ఏర్పాటు చేసిన పాతకాలం నాటి ముఖద్వారం


నాపరాయిది చెదరని చరిత్ర

పునాది నుంచి సమాధి దాకా రాతి కట్టడాలే

- దశాబ్దాలుగా ఈ కట్టడాలకు తగ్గని ఆదరణ
- నేటికీ పల్లెల్లో నాపరాయితోనే ఇళ్లు, ఇతర నిర్మాణాలు
- తాండూరులో ఏళ్లు గడిచినా చెక్కుచెదరని కట్టడాలెన్నో..

7

రాతి కట్టడాలు అనగానే టక్కున గుర్తుకొచ్చేది తెలంగాణ - కర్ణాటక సరిహద్దులోని తాండూరు. ఈ ప్రాంతం నాపరాతి గనులు, రాతి కట్టడాలకు ప్రత్యేకం. దశాబ్దాల నుంచి ఈ ప్రాంతంలో నాపరాయితోనే నిర్మాణాలు చేపడుతున్నారు. ఇళ్లు, గుళ్లు, కోటలు, బురుజులు, గ్రామాల ముఖద్వారాలు, మసీదులు, సమాధులు ఇలా ఏ నిర్మాణాలైనా నాపరాళ్లతో నిర్మించినవే.. వెరసి అవి నేటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. తాండూరు ప్రాంతంలో నాపరాతి నిక్షేపాలు, వాటి వినియోగంపై ప్రత్యేక కథనం.



-బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు



మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

శంకర్‌పల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తెలిపారు. మోకిలలోని క్రీడా ప్రాంగణంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో గెలుపోటములను అవగాహన చేసుకుంటారన్నారు. దేహదారుఢ్యంతో పాటుగా మానసికంగా దృఢత్వం పెరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించే అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి, ఎంపీడీవో వెంకయ్య గౌడ్ . శంకర్‌పల్లి, చేవెళ్ల ఎంఈఓలు అక్బర్, పురందాస్ తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



కడా కార్యాలయంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

కొడంగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల శ్రీకారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో విద్యాకమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పూర్వప్రాథమిక, ఉన్నత విద్యపై సమీక్షించారు. ప్రతీ పాఠశాలలో ఇంగ్లీష్ బోధనను ఆచరణలో పెట్టాలని, పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. ప్రతీ పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కార్పోరేట్ స్థాయిలో బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి పూర్వప్రాథమిక పాఠశాలలే కీలకమన్నారు. అనంతరం కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సింగాపురం గ్రామస్తులు

సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలి

శంకర్‌పల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం ప్రధాన రహదారి వెంట నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు మంగళవారం నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి రోడ్డు పనులు వెంటనే చేపట్టాలంటూ నినాదాలు చేశారు. ప్రైవేట్ వ్యక్తులు అభ్యంతరం చెబితే పనులు ఎలా ఆపుతారని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్ స్పందించి చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో సమస్య గురించి వివరించారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని వైస్ చైర్మన్‌తో పాటుగా కౌన్సిలర్ హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. నిరసన తెలిపిన వారిలో కౌన్సిలర్ సంతోష్, సింగాపురం వాసులు శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, దేవయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు, సంజీవ, వెంకట్‌రెడ్డి నరహరి, రవిప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాలను సందర్శించిన డీటీ

ధారూరు: అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాలను మంగళవారం మండల డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ సందర్శించారు. అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాల్లో పాఠశాలలను పరిశీలించారు.

కొమురం భీమ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పరిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ అన్నారు. పరిగిలో మంగళవారం కొమురంభీమ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు అనిల్‌నాయక్, బాలకృష్ణ, అంబర్‌సింగ్, తులసిరాం, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గౌతాపూర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, రవి బృందం మంగళవారం సర్వే నంబర్-101, 103, 104, 107, 109, 150, 61, 62, 55/1, 55/2 సర్వే నంబర్లలోని ప్లాట్లను పరిశీలించారు. గౌతాపూర్ పంచాయతీ కింద 1,459మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, లేఅవుట్ల కోసం 16దరఖాస్తులొచ్చాయని కార్యదర్శి తెలిపారు. నిబంధనల మేరకు ఉన్న వాటికే ఎల్‌ఆర్‌ఎస్ అప్రూవ్ అవుతుందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.వెయ్యి కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు నవంబరు 9వ తేదీ కల్లా మిగితా డబ్బులు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. వెంచర్లలో అనుమతుల మేరకు పంచాయతీకి జాగా వదలాలన్నారు. మెయిన్ రోడ్డు 40ఫీట్లు, అంతర్గత రోడ్లు 25ఫీట్ల వెడల్పు ఉండాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

సెక్యూరిటీ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీ4ఎస్ సెక్యూరిటీ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్బుస్ సుభాన్ మంగళవారం పేర్కొన్నారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్‌లో అక్టోబరు 24న ఉదయం 10.30గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. జీ4ఎస్ కంపెనీలో 100 వరకు సెక్యూరిటీ గార్డులు, ఎస్కార్ట్ గార్డ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి పురుషులు మాత్రమే కావాలని, అలాగే నైట్‌షిఫ్ట్ విధులు నిర్వహిస్తామని తెలిపారు. వేతనం రూ.17వేల నుంచి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు బియాసాబ్ మొబైల్ నం: 9676047444కు సంప్రదించాలని కోరారు.

తిరుమలపై రాజకీయం తగదు


మాట్లాడుతున్న బక్కని

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాజకీయం చేయడం తగదని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. 'చంద్రబాబు ఒక కన్నును పొడుచుకున్నారా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తపై బక్కని నర్సింహులు స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. టీటీడీ బోర్డు స్వయం ప్రతిపత్తి సంస్థ అని, భక్తుల కోసం తీసుకునే నిర్ణయాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదన్నారు. తప్పులు సరిదిద్దే క్రమంలోనే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల దర్శనాలను నిలిపివేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వారు తెలంగాణాలో వ్యాపారం చేయడంలేదా? వారు తెలంగాణకు రారా? అంటూ చం ద్రబాబుపై అనిరుధ్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకే కాదు, దేశవిదేశాలకూ వెళ్తారన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా మాట్లాడే నాయకులను అదుపుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఈ సందర్భంగా నర్సింహులు కోరారు.

నేటి నుంచి పెద్ద ఉమ్మెంతాల్ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పూడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చారిత్రక పెద్ద ఉమ్మెంతాల్‌లో గల తిరుమలనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ మంగళవారం పేర్కొంది. మంగళవారం ధ్వజారోహణం, ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. నేడు గీతాయజ్ఞం, గురువారం ఉదయం 4గంటల నుంచి రథోత్సవం, శుక్రవారం ఉదయం పూల వసంతోత్సవం, రాత్రి 11గంటల నుంచి స్వామివారికి ఏకాంత సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేష్

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నివారణకు ప్రజలంతా భాగస్వాములు కావాలని, మహిళలు విద్యావంతులైతేనే మానవ అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం అని ప్రజ్వల సచ్ఛంద సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం యాచారంలో మానవ అక్రమ రవాణా నివారణపై అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరి స్వార్థానికి ఎంతో మంది అమ్మాయిల జీవితాలను పాడుచేసే దుండగులను రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అంగన్‌వాడీ టీచర్లు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌ట్రాకింగ్ వేగంగా విస్తరిస్తోందని, దీన్ని గమనించి సెల్‌ఫోన్ వినియోగంతో కలుగుతున్న నష్టాలను పిల్లలకు వివరించాలని చెప్పారు. ప్రేమ పెళ్లిళ్లు, సినిమాల కారణంగా మహిళలు మోసాలకు గురవుతున్నారని, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల సంస్థ 28ఏళ్లుగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో 28,600 మంది అమ్మాయిలను అక్రమ రవాణా నుంచి కాపాడి పునరావాసం కల్పించామని తెలిపారు. ప్రభుత్వ శాఖల సహకారంతో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణిస్తున్నట్లు చెప్పారు. మోసాలకు గురైన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోందని ఐసీడీఎస్ ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి సీడీపీవో తులసి అన్నారు. సమావేశంలో సంస్థ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ మిథాలిరాజ్, పాల్గొన్నారు.

కుల గణనకు సన్నాహాలు

మేడ్చల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం ఆదేశాలివ్వడతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అధికారులు కుల గణనకు సన్నాహాలు చేస్తున్నారు. జనాభా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ పదవుల్లో అవకాశాలు కల్పించేందుకు కుల గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితరాంశాలపై సమగ్ర సమాచార సేకరణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 20శాతం, స్థానిక సంస్థల్లోని రాజకీయ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ జనాభా గణన లెక్కించాలని డిమాండ్లు వస్తున్నాయి. గతంలో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనాలు వేస్తున్నారు. కుల గణన చేస్తేనే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. సర్పంచ్, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకూ ఇది ప్రామాణికం కానుంది.

సిబ్బంది నియామకానికి కసరత్తు

జిల్లాలో ఇంటింటి సర్వేకు సిబ్బంది(ఎన్యూమరేటర్లు) ఎంత మంది అవసరమో అధికారులు అంచనా వేస్తున్నారు. 80రోజుల్లో కుల గణన పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లోని సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు.

నాపరాయిది చెదరని చరిత్ర

- పునాది నుంచి సమాధి దాకా రాతి కట్టడాలే
- దశాబ్దాలుగా ఈ కట్టడాలకు తగ్గని ఆదరణ
- నేటికీ పల్లెల్లో నాపరాయితోనే ఇళ్లు, ఇతర నిర్మాణాలు
- తాండూరులో ఏళ్లు గడిచినా చెక్కుచెదరని కట్టడాలెన్నో..


నాపరాళ్ల ఘనుల్లో తవ్వకాలు


ఇళ్ల పైకప్పులకు వేసిన నాపరాయి


బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాతి కట్టడాలకు గుర్తుకొచ్చేది తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లోని తాండూరు ప్రాంతం. ఇక్కడి నాపరాతి గనులు, రాతి కట్టడాలు దేశవిదేశాల్లో ప్రసిద్ధిగాంచాయి. దశాబ్దాల నుంచీ నాపరాయితో ఇళ్లు కట్టుకుంటున్నారు. వేలాది ఎకరాల్లో ఉన్న రాళ్ల నిక్షేపాలను వేలాది మందికి ఉపాధి చూపుతున్నాయి. ఇళ్ల పునాదులకు నాపరాయే వేస్తారు. చరిత్రను చూసినా ఇళ్లు, గుళ్లు, కోటలు, బురుజులు, గ్రామాల స్వాగత తోరణాలు, మసీదులు, సమాధులు వంటివన్నీ నాపరాళ్లతోనే కట్టారు. ఏళ్లపాటు అవి చెక్కుచెదరలేదు. నిజాం పాలనకు ముందు నుంచే ఇక్కడి ప్రజలకు నాపరాయితో పెనవేసుకున్న బంధంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

బషీరాబాద్, తాండూరు మండలాల్లో వేల ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. ఈ గనుల్లో నాపరాయి తవ్వి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. మార్కెట్లో నాపరాయికి డిమాండ్ ఉండడంతో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు, గని కార్మికులు, కూలీలు వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. నాపరాయి పాలిషింగ్ యూనిట్లు(పరిశ్రమలు)తో దేశంలోని వివిధ ప్రాంతాల వారికి ఉద్యోగ, ఉపాధి దొరుకుతోంది. ఈ ప్రాంతంలో నాపరాయి ఇళ్ల నిర్మాణాలు, చారిత్రక కట్టడాలు విరివిగా కనిపిస్తుంటాయి. ప్రస్తుతం సీసీ భవనాలు కడుతున్నా పునాదికి మాత్రం నాపరాయినే వాడుతున్నారు. నాపరాళ్లు చవకగా, స్థానికంగా లభిస్తుండడంతో పునాదికి, గోడలకు, ఇళ్లకు వాడుతున్నారు. నాపరాయి నిర్మాణాలు దశాబ్దాల పాటు మన్నికగా, చెక్కు చెదకుండా ఉంటాయి. నేటికీ ఇక్కడి గ్రామాల్లో 90శాతం ఇళ్లను నాపరాళ్లతో కట్టి, పైకప్పును సైతం పల్చటి బండలతో వేస్తారు.

> **బషీరాబాద్‌లో చారిత్రక కట్టడాలెన్నో**
>
> బషీరాబాద్ ఒకనాటి జిల్లా కేంద్రం. నిజాం పాలనలో గుల్బర్గా రాష్ట్రంలో అంతర్భాగం. ఇక్కడి బ్రిటిష్, నిజాం కాలంలో కార్యాలయాలుగా వినియోగించిన భవనాలు అనేకం ఉన్నాయి. అప్పట్లో వినియోగించిన కలెక్టర్, కోర్టు భవనం, జైలు, పోలీస్ సూపరింటెండెంట్, డీఎస్పీ కార్యాలయాలు, పోలీసు క్వార్టర్లు, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ వంటి భవనాలు, పలు కార్యాలయాలు నాపరాళ్లతో కట్టినవే. వందల ఏళ్లు దాటినా.. శిథిలావస్థకు చేరినా ఉనికి చాటుకుంటున్న రాతి కట్టడ భవనాలు ఎన్నో ఈ ప్రాంతాల్లో ఉన్నాయి.

దొంగల నుంచి రక్షణ కోసం నాపరాతి బురుజుల నిర్మాణం

పూర్వికులు దివిటీ దొంగల నుంచి సంపదనను కాపాడుకునేందుకు గ్రామాల్లో ఎత్తైన ప్రదేశంలో నాపరాళ్లలతో పెద్ద, బురుజులను నిర్మించగా నేటికీ అవి చెక్కుచెదరలేదు. ప్రజలు తమ సంపదను బురుజుల్లో భద్రపర్చుకునేవారు. బురుజులకు ఒకే ద్వారం పెడతారు. అవసరమైతే కొందరు గ్రామస్తులు కలిసి బురుజుల్లో రాత్రిళ్లు కాపలా ఉండేవారు. దీంతో దొంగలు వాటిల్లోకి దూరే వీలుండేది కాదు. దొంగలు వచ్చినా బురుజుపై ఉండి రాళ్లతో కొట్టేవారు. వేడినీళ్లను చల్లి దొంగలను తరిమికొట్టేవారని పెద్దలు చెబుతారు. దశాబ్దాలు గడిచినా కొన్నిచోట్ల బురుజులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.


నాపరాయితో నిర్మించిన రైల్వే బ్రిడ్జి

> **అన్ని పరిస్థితులనూ తట్టుకునే ఇళ్లు**
>
> వేసవి, వర్షా కాలం, చలికాలం ఏ సీజన్ వచ్చినా నాపరాయి ఇళ్లకు ఢోకా ఉండదు. ఇళ్ల పైకప్పులను కర్రలపై పేర్చిన పల్చని బండరాళ్లతో తీర్చి దిద్దుతారు. దీంతో వేడి కూడా అంతగా ఉండదు. పైకప్పునకు ఎక్కువగా కర్రలు వాడతారు కాబట్టి వేడి కిందికి రాదు. రాళ్లపైకప్పుల ఇళ్లు చల్లాగానే ఉంటాయి. వర్షాకాలంలోనూ ఈ పైకప్పులు అస్సలే ఉరవవు. బంగళాలు, మిద్దెలపై వర్షపు నీరు నిలిచి ఉరవడం, గోడల్లో పగుళ్ల ఏర్పడడం వంటివి సంభవిస్తాయి. కానీ బండరాళ్ల ఇళ్లపై చుక్కనీరు నిలువదు. చలికాలంలోనూ ఈ ఇళ్లలో వెచ్చగా ఉంటుంది. ఈ దృష్ట్యా రాతి కట్టడాల ఇళ్లు అన్నివాతావరణ పరిస్థితులను అనుకూలం అనడంలో సందేహం లేదు.

కావాల్సిన ఆకారంలో ఇళ్ల నిర్మాణం

ప్రజలు తమకు కావాల్సిన ఆకారాల్లో నాపరాళ్ల ఇళ్లను నిర్మించుకుంటారు. పైకప్పులను పల్చని బండరాళ్లతో వేసుకుంటున్నారు. కొత్త వారు నాపరాళ్ల ఇళ్లు, పైకప్పులను చూసి ఆశ్చర్యపోతుంటారు. పైకప్పు బండలు పడిపోవా అని గ్రామస్తులను అడుగుతుంటారు. అలాగే నాపరాయి కట్టడాల చరిత్రను తెలుసుకుంటారు.

అంగన్‌వాడీల్లో సరైన వసతులు కల్పించాలి


సీసీ రోడ్డు పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వత్‌పల్లి, దామర్‌చెడ్, కొత్లాపూర్, ఎక్మాయి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ మంగళవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతి, సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పర్వత్‌పల్లిలో వేసిన సీసీ రోడ్డును పరిశీలించి అక్కడున్న పీఆర్ ఏఈతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని కార్యదర్శి మౌనిక, టీచర్ బాలమణిలతో అని పారిశుధ్య నిర్వహణ సరిగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. పనిచేయని బోరుమోటార్లకు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి అంజుమ్‌కు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, మిషన్ భగీరథ డీఈఈ తేజబాబు, తాండూరు సీడీపీవో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ షేర్ఖాన్ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతుంటేనే బిల్లులు

తాండూరు రూరల్: సీసీ రోడ్డు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. తాండూరు మండలం చింతామణిపట్నంలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. రూ.3లక్షలతో మాధవరెడ్డి ఇంటి నుంచి కుర్వ నర్సప్ప ఇంటి వరకు, రూ.2లక్షలతో రామప్ప ఇంటి నుంచి ఊరడమ్మ ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ-ఆర్జీకేకాలనీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రశాంత్, వినోద్ రెడ్డి, అక్షయ్, సుబాష్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


రేవంత్‌రెడ్డి,మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనిల్ మాట్లాడుతూ కరన్‌కోట్ గ్రామం నుంచి బషీరాబాద్ మండల కేంద్రానికి రూ.30కోట్లతో 12కిలో మీటర్ల రోడ్డు మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి

మర్పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయనతో పాటు వైస్‌చైర్మన్‌గా మల్లేశ్‌యాదవ్‌తో పాటు డైరెక్టర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ సరే.. వసతులేవి?


చేవెళ్ల ఆస్పత్రిలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఆక్సిజన్ ప్లాంట్

(5వ పేజీ తరువాయి)

ఉండటం లేదు. దీంతో చాలా చోట్ల కోట్ల రూపాయలు చేసే విలువైన యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

చేవెళ్ల ఆస్పత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో జిల్లా ఆసుపత్రితోపాటు వనస్థలిపురంలో ఏరియా ఆసుపత్రి ఉంది. చేవెళ్ల, షాద్‌నగర్, హయత్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, యాచారంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు కొనసాగుతున్నాయి. ఈ సెంటర్లన్నీ అప్‌గ్రేడ్ చేశారు అయినా అదే దుస్థితి. చేవెళ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా 2022లో అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 17.50 కోట్లు మంజూరు చేసింది. అయినా ఏడాదిన్నర కాలంగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ హెల్త్ సెంటర్ స్థాయిలోనే 59 మంది వైద్య సిబ్బందికి 31 మంది ఉన్నారు. 20 మంది డాక్టర్లు ఉండాలి కానీ. 11 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న 11 మంది డాక్టర్లు కూడా స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు. ఓపీ భారీగా పెరిగింది. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో ఆపరేషన్ సమయంలో రక్తం కోసం నగరానికి పరుగులు తీస్తున్నారు.

రూ. 80 లక్షల ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగం

కరోనా సమయంలో ఆక్సిజన్ కోసం అల్లాడుతున్న సమయంలో భారత్ డైనమిక్ లిమిటెడ్(బీడీఎల్) ప్రతినిధులు రూ.80లక్షలు ఖర్చు పెట్టి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన రూ.10లక్షలకు పైగా విలువైన జనరేటర్‌ను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇచ్చారు. ఏ ఒక్క రోజు కూడ ఈ ప్లాంట్‌ను వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో జనరేటర్ కూడా ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ దర్శనమిస్తుంది. ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో ఓల్టేజీలో హెచ్చుతగ్గులతో డయాలసిస్ కేంద్రం లో ఇటీవల షార్ట్ సర్క్యూట్ సంభవించి ఎల క్ట్రిక్ వైరింగ్ మొత్తం కాలిపోయింది.

షాద్‌నగర్‌లో ల్యాబ్ పరికరాలు కరువు

షాద్‌నగర్ కమ్యూనిటీ అస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023లో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే భవన నిర్మాణం కోసం రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో షాద్‌నగర్ పట్టణ శివారులోని లింగారెడ్డిగూడ ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టారు. పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం, చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌కు పాత బకాయిలు చెల్లించడంతో పాటు, నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో పనులు నడుస్తున్నాయి. ప్రస్తుతం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో 80 మంది సిబ్బంది అవసరం ఉండగా కేవలం 40 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. వైద్య సిబ్బందితో కలిపి 40 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం 22 మంది వైద్యులు ఉన్నారు. వైద్య సిబ్బందికి అనుగుణంగా నర్సులు అందుబాటులో లేరు. ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. అలాగే ఫార్మసీలో నలుగురు సిబ్బంది అవసరం ఉంది. అయినా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ, ల్యాబ్ పరికరాలు అందుబాటులో లేవు.

ఆమనగల్లులో ఓపీ మాత్రమే

ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2021 డిసెంబర్‌ల 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. కానీ.. నేటికి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, బెడ్స్ లేవు. 32 మంది వైద్య సిబ్బందికి గాను 24 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆస్పత్రి భవనం కోసం రూ.17.50 కోట్లు మంజూరు కావడంతో పాత భవాన్ని తొలగించి అదేస్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా ఆసుపత్రి డాక్టర్ క్వార్టర్‌లో కొనసాగిస్తున్నారు. భవనం లేని కారణంగా ఆసుపత్రి ఓపి సేవలకే పరిమితమైంది. ఆసుపత్రిని సీహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసినా వైద్య సేవలు మెరుగుపడలేదు.


వేధిస్తున్న డ్రగ్స్ కొరత

30 పడకలుగా ఉన్న మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 50 పడకల కోసం అప్‌గ్రేడ్ చేసినప్పటికీ.. 16 మంది డాక్టర్లకు 12 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారు. ఇబ్రహీంపట్నంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన తర్వాత పది మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. గైనకాలజిస్టు, అనస్థిషియా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ హైపర్ టెన్షన్(ఎస్పీపీ) డ్రగ్స్ కొరత ఉంది.

సర్జన్లు లేక నిలిచిన ఆపరేషన్లు

వికారాబాద్ జిల్లా పరిగిలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ అప్‌గ్రేడ్ అయినప్పటికీ.. ఇక్కడ యంత్రాల కొరత వేధిస్తోంది. డాక్టర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ.. ఎక్స్‌రే, డెంటల్ చైర్ అందుబాటులో లేదు. ఆస్పత్రిలో నిత్యం 400 నుంచి 500 వరకు ఓపీ రోగులు వస్తున్నారు. 15 నుంచి 25కు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. కొన్ని రకాల మందులు ఆసుపత్రిలో లేకపోవడంతో బయటకు రాస్తున్నారు. కొడంగల్‌లోని 30 పడకల ఆసుపత్రిని 50 పడకలగా అప్‌గ్రేడ్ చేశారు. అయినా 11 మంది వైద్య సిబ్బందికి పది మంది ఉన్నారు. ఆపరేషన్ థియేటర్ ఉన్నప్పటికీ.. సర్జన్ లేకపోవడంతో ఆపరేషన్లు జరగడం లేదు. కొడంకగల్‌కు మంజూరైన మెడికల్ కాలేజీకి అసుపత్రిని అనుసంధానించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని పీహెచ్‌సీని 2021లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఆప్‌గ్రేడ్ చేశారు. 30 మంది వైద్య సిబ్బందికి గాను 27 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదు.

> **చుట్టపు చూపులా డాక్టర్ల రాక**
>
> స్థానికంగా స్కానింగ్ మెషిన్లు లేక కడుపులో బిడ్డతో 42 కిలో మీటర్ల మేర ప్రయాణం చేసి నగరానికి వెళ్లి స్కానింగ్ చేయిస్తున్నారు. పేరుకే పెద్దాసుపత్రి అయినా ఇక్కడ గర్భిణులకు అవసమయ్యే అల్ట్రాసౌండ్ మిషన్ సైతం అందుబాటులో లేదు. గత 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం సరఫరా చేసిన యంత్రం పనిచేయడం లేదు. అల్ట్రాసౌండ్‌తో పాటు రేడియాలజిస్టు లేరు. ముగ్గురు గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ.. ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేరు. వారానికి రెండు సార్లు చుట్టపు చూపులా ఇలా వచ్చి అలా వెళుతున్నారు. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి దగ్గరలో ఉంటంతో అక్కడికి రెఫర్ చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి.

> **పేరుకే పెద్ద ఆస్పత్రి**
>
> 
>
> చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే ఏరియా ఆసుపత్రి. ఇక్కడ రోగులకు అవసరమైనా ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో వైద్యులు చిట్టీ రాసి ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ఇంత మంది వైద్యులు ఉండి కూడా ఏమీ లాభం లేదు. నిత్యం ఓపీ చూసి పంపిస్తున్నారే తప్ప ఆపరేషన్లు చేసిన దాఖాలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించాలి. అవసరమైన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలి. అలాగే వైద్యులు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.
>
> - పి.మల్లారెడ్డి, చేవెళ్ల పట్టణం

ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది వివరాలు

రంగారెడ్డి జిల్లా	ఉండాల్సిన సిబ్బంది	ప్రస్తుతం	ఖాళీలు
చేవెళ్ల	59	31	28
షాద్‌నగర్	80	40	40
కల్వకుర్తి(ఆమనగల్లు)	32	24	08
మహేశ్వరం	16	12	04
రాజేంద్రనగర్	38	30	08
ఇబ్రహీంపట్నం	10	05	05
మొత్తం	235	142	93
వికారాబాద్ -మేడ్చల్ జిల్లా			
పరిగి	57	57	0
కొడంగల్	11	10	01
శామీర్‌పేట	30	27	03
మొత్తం	98	94	04



కలెక్టర్‌కు పండ్లు బహూకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన మధుసూదన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ శశాంకను కలిశారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌కు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 507/2548/2లో 178.09 ఎకరాల భూమిని 2016 సంవత్సరంలో ప్రభుత్వం కేటాయించినట్లు చైర్మన్ తెలిపారు. మార్కెట్ నిర్మాణంకు రూ.314 కోట్లు వివిధ మార్కెట్‌ల ద్వారా నిధులు వచ్చినట్లు చెప్పారు. మొదటి ఫేజ్ పనులకు డీపీఆర్ సిద్ధంగా ఉందన్నారు. ఈ ఫైల్ సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరినట్లు చెప్పారు. మార్కెట్ నిర్మాణం, అభివృద్ధి కోసం తాను సంపూర్ణంగా సహరిస్తానని కలెక్టర్ తెలిపినట్లు చైర్మన్ చెప్పారు.

గుంతల రోడ్డుతో నరకయాతన

- భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసం
- అధ్వానంగా నందిగామ-వీర్లపల్లి రహదారి
- వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు



భారీ వాహనాల రాకపోకలతో గుంతలమయంగా మారిన నందిగామ-వీర్లపల్లి రోడ్డు

నందిగామ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలతో గ్రామాలకు బీటీ, సీసీరోడ్ల నిర్మించాయి. అందులో భాగంగా నందిగామ మండల కేంద్రం నుంచి వీర్లపల్లి, చంద్రాయన్‌గూడ సమీపంలోని పాతజాతీయ రహదారి నుంచి మామిడిపల్లి వరకు కోట్ల రూపాయలతో గతంలో బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. వీర్లపల్లి శివారులోని పలు ఐరన్ పరిశ్రమలు ముడిసరుకుతో పాటు వారు తయారుచేసే ఐరన్‌ను భారీ వాహనాల్లో అధిక లోడ్‌తో తరలిస్తుండటంతో నందిగామ-వీర్లపల్లి రోడ్డు, చంద్రాయన్‌గూడ-మామిడిపల్లి రోడ్డు నిర్మించిన కొన్ని రోజులకే ధ్వంసమయ్యాయి. రోడ్లు గుంతలమయం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాల ద్వారా అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, ఈదులపల్లి, మొదళ్లగూడ, మామిడిపల్లి, సింబియాసిస్ యూనివర్సిటీకి వెళ్లేవారు ద్విచక్ర వాహనం, కార్లలో ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తుంటారు. గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై సుమారు 25 టన్నుల సామర్థ్యంతో ఉన్న వాహనాలు వెళ్లేవిధంగా రోడ్డునిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమకు సంబంధించిన వాహనాలు 50 టన్నుల పైనే ఉన్న లోడ్‌తో వెళ్తుండటంతో రోడ్డు ధ్వంసమైందని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసిన కొన్ని రోజులకే పరిస్థితి దయనీయంగా మారడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించలేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, రోడ్డు బాగుచేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



చంద్రాయన్‌గూడ సమీపంలోని పాతజాతీయ రహదారి నుంచి మామిడిపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రాత్రివేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నిర్మించిన నందిగామ-వీర్లపల్లి రోడ్డు ధ్వంసం కావడానికి కారణమైన పరిశ్రమల వాహనాలపై చర్యలు తీసుకోవాలి. వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తుండటంతో ధ్వంసమవుతున్నాయి. పరిశ్రమలపై యాజమాన్యంపై చర్యలు తీసుకొని రోడ్డును బాగు చేయించాలి.

- జేకే నర్సింహులు, మాజీ సర్పంచ్, అప్పారెడ్డిగూడ

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు నెలలక్రితం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. చిన్నతూండ్ల, పెద్దతూండ్ల గ్రామాల మధ్య రెండు నెలల క్రితం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో చిన్నతూండ్లకు చెందిన రాఘవేందర్(35) తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాఘవేందర్ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయాల సంరక్షణకు ఏకం కావాలి



గట్టుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన అభిషేకంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మహేశ్వరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలయాలను కాపాడుకోవడానికి ప్రతీ హిందువు ఏకం కావాల్సిన అవసరం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం పక్కనున్న దర్గా వద్ద సోమవారం ఓ ముస్లిం వ్యక్తి మొక్కుబడి నిమిత్తంగా మేకను బలియ్యడాన్ని నిరసిస్తూ బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ దేవాలయాల అపవిత్రతో పాటు వరుస దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలేదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడి ఇస్లామిక్ తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిపై దాడి మరవకముందే గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న దర్గా వద్ద మేకను కోసి ఆలయ పవిత్రతను దెబ్బతీశారని, కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు పాపయ్యగౌడ్, జంగయ్యయాదవ్, కుండె వెంకటేష్, మాధవాచారి, యాదీష్, మధుమోహన్, సుధాకర్, యాదగిరిరెడ్డి, శ్రవణ్, రాఘవేందర్, ఎం.రాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం



కేశంపేట : బైర్కాన్‌పల్లిలో సభ్యత్వం ఇస్తున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



శంషాబాద్ రూరల్ : సభ్యత్వ నమోదులో మల్లారెడ్డి

శంషాబాద్ రూరల్/కేశంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని కవ్వగూడ, మల్కారం గ్రామాల్లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సిద్దు, శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల ఏకైక పార్టీ బీజేపీయేనని, పార్టీ బలోపేతానికి మరింతగా సభ్యత్వాలు చేయించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి(పీవీఆర్) పిలుపునిచ్చారు. మంగళవారం కేశంపేట మండలంలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, మంగళగూడ, అల్వాల, కొత్తపేట, సంతాపూర్, కొనాయపల్లి, చౌలపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా పీవీఆర్ పరిశీలించి మాట్లాడారు. బీజేపీ పట్నం పార్టీగా ఉండేదని, నేడు గ్రామీణ స్థాయిలో అసాధారణ పెరుగుతుందని వివరించారు. బూత్‌కి కనీసం 100 సభ్యత్వాలు చేయాలని సూచించారు. పార్టీ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీచేసే అవకాశం వస్తుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు పార్టీలో గుర్తింపుతో పాటు పార్టీ పదవులలో స్థానం ఉంటుందని తెలిపారు. మోదీ ప్రభుత్వం చివరి వ్యక్తి వరకూ పథకాలు చేరేలా పనిచేస్తుందని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు రఘురాములుగౌడ్, సభ్యత్వ నమోదు కోకన్వీనర్లు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, మహేష్, రావుల యాదయ్య, విఠల్ గౌడ్, కుమార్, వెంకటేశ్వర్‌జీ, నర్సింలు, రాకేష్, చౌడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.100 కోట్ల రుణాలు



మాట్లాడుతున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): రైతులు దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా ఈ ఏడాది రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం మాడ్గుల పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల శ్రేయస్సును కాంక్షించి పీఏసీఎస్ ద్వారా ఇతోధికంగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా రూ.3 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించి ఇప్పటి వరకు రూ.70 లక్షలు అందించినట్లు వెల్లడించారు. నవంబరు మొదటి వారంలో ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు వెంకటేశ్ తెలిపారు. రైతులను మోసగించే వారు ఎంతటి వారైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్య, డీసీసీబీ మేనేజర్ గోపాల్, సీఈవో దేవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ రవీందర్‌రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న భవన పనులను పరిశీలించారు. బేస్ ఎత్తును పెంచాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. దాంతో ఎస్ఈ సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఈ రవీందర్, ఏఈ బాల్ రెడ్డి లతో భవన నిర్మాణ పనులను ఈఈ పరిశీలించారు. ఇప్పటికే స్లాబ్ నిర్మాణానికి సిద్ధంచేసిన సెంట్రింగ్ చెక్కను తొలగించి బేస్ ఎత్తును పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నాయకుడు బాబా తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి ఎ.నర్సింహ కోరారు. మంగళవారం నేదునూరు ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న రేషన్ బియ్యం, పప్పు, వంట సామగ్రిని పరిశీలించారు. ఎంఈవోను ప్రిన్సిపాల్ విష్ణుప్రియతో కలిసి ఉపాధ్యాయ బృందం సత్కరించారు. నేదునూరు ఆదర్శ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద నూతన గది నిర్మాణానికి రూ.13.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50లక్షలు మంజూరుచేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా రూ.8లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యాశాఖ డీఈఈ ఖలీమొద్దీన్, తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గీతా నర్సింహ!

- వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి



ఆమనగల్లు మార్కెట్ కమిటీ కార్యాలయం

ఆమనగల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లు మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారైంది. కాగా, అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకానికి ప్రభుత్వానికి 15 మంది పేర్లు సిఫారసు చేశారు. ఈమేరకు మార్కెట్ మార్కెటింగ్ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా పాలకవర్గ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సతీమణి గీత, వైస్ చైర్మన్‌గా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్లు ఖరారయ్యాయి. డైరెక్టర్లుగా వస్పుల శ్రీశైలం(ఆమనగల్లు) తాళ్ల రవీందర్(సంకటోనిపల్లి) ఎండీ అజీమ్(తలకొండపల్లి), వెంకటరెడ్డి (వెల్జాల్) మిట్టపల్లి అంజయ్య (తలకొండపల్లి), శ్యాంసుందర్‌రెడ్డి(రామకృష్ణాపురం), జెల్ల రమేష్‌గౌడ్(బ్రహ్మణపల్లి), పి.జంగయ్యగౌడ్ (మాడ్గుల), ఉడతల యాదయ్య(నాగిళ్ల), సంపత్(నల్లవారిపల్లి) డైరెక్టర్లుగా నియమితులయ్యారు. కమిటీలో మాడ్గులకు 4, ఆమనగల్లుకు 2, కడ్తాల్‌కు 1, తలకొండపల్లికి 4 డైరెక్టర్ పదవులు లభించాయి. కాగా, ఉత్తర్వులు అధికారికంగా రావాల్సి ఉంది.

పాల పదార్థాల తయారీతో ఆర్థికంగా వృద్ధి చెందాలి



శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతో మహిళలు, పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తి గణనీయంగా పెంచుకోవాలని, పాలతో రకరకాల పదార్థాలను తయారు చేసి చిరు వ్యాపారం చేసుకుంటే రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలని రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ శశికుమార్‌లు సూచించారు. మంగళవారం ఆస్ట్రేలియా అలుమ్నీ గ్రాంట్ ఆధ్వర్యంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో యాచారం మండలం గడ్డమల్లాయగూడలో పాల ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన అవగాహన సదస్సును వారు ప్రారంభించి మాట్లాడారు. పాలతో పెరుగు, మజ్జిగ, కోవా, రసగుల్ల, కలకంద, పన్నీరు, నెయ్యి, తదితర పదార్థాలను తయారు చేసుకోవచ్చన్నారు. పన్నీరుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ సందర్భంగా పాలతో పదార్థాలను తయారు చేయడంపై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మహేందర్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ సాహిత్యరాణి తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పెండింగ్ బిల్లులు చెల్లించాలి



షాద్‌నగర్ రూరల్ : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు/షాద్‌నగర్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డీఏ, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని కోరుతూ తెలంగాణప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీక్షలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలు, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన పెన్షన్, సరెండర్, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా మహిళా ప్రముఖ్ వనం సుమరంజిత కోరారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా ఈనెల 28న తహసీల్దార్లకు వినతి పత్రాలందజేత, నవంబరు 5న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, నవంబరు 23న ఛలో ఇందిరా పార్క్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించే వరకు వివిధ స్థాయిల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తపస్ ఆమనగల్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వాతి, మౌనిక, కడ్తాల మండలాధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కాగా, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో టీచర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం డీఏ, పీఆర్సీని అమలు చేసి హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్ధన్, మండల శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, సురేష్ కుమార్, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం సెమినార్‌ను విజయవంతం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి సెమినార్‌ను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల డివిజన్ స్థాయి సెమినార్-2024 నవంబరు 1న చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మిక హక్కులపై చేస్తున్న నిర్లక్ష్యం, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయబోతున్నామన్నారు. సెమినార్‌ను విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో కార్మికులు, అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు శివ, కిష్టయ్య, షబ్బీర్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం నర్సింహ

చౌదరిగూడ, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): మహిళలకు, వీధి వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళ శక్తి పథకం కింద అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఏపీఎం నర్సింహ తెలిపారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య భవనంలో అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి రుణాల్లో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి మొత్తం రూ.24 కోట్లు మంజూరైనట్లు వివరించారు. 150 యూనిట్ల పాడి గేదేలు, 2వేల పెరటి కోడిపిల్లల పెంపకం, చిరు వ్యాపారుల కోసం 150 యూనిట్లు అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. రూ.24 కోట్లకు గాను 11 కోట్లు మహిళా శక్తి రుణాలను బ్యాంకుల ద్వారా అందజేసినట్లు వివరించారు. మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి రాణి, సీసీలు రమేష్, దేవయ్య, స్వర్ణలత, స్వరూప, వీవోఏలు పాల్గొన్నారు.

ఎయిడ్స్, క్షయపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామిరెడ్డి

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ క్షయ వ్యాధులపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని లింక్ వర్కర్ స్కీం జిల్లా కో-ఆర్డినేటర్ టి.రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఎయిడ్స్, క్షయ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి, ఉద్యోగ రంగంలో రాణించాలి

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మరింతగా రాణించాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం పిలుపు నిచ్చారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన వీరమల్ల ఊర్మిల, రాధాకృష్ణమూర్తి దంపతుల కుమారుడు సాయినాథ్ నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఆమనగల్లులో సాయినాథ్‌ను సన్మానించారు.

శివసేనా రెడ్డిని కలిసిన పవన్

తలకొండపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టిప్పలపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు పవన్ వాల్మీకి మంగళవారం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో మినీస్టేడియం ఏర్పాటు చేయాలని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని శివసేనా రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్ అన్నారు. దెబ్బడగూడలో మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా రావిచెట్టు చందును ఎన్నుకొని సత్కరించారు. ఎస్.సుధాకర్, బర్కం ప్రభాకర్, ఎస్.విజయలక్ష్మి, మండల రాములు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటికపల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఎంట్ల యాదయ్య కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు కాగా, ఖర్చుల నిమిత్తం గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్‌గౌడ్ రూ.12వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. జీపీ సిబ్బంది ఎంట్ల పద్మమ్మ, బర్ల పోచమ్మ, బర్ల ఎట్టమ్మ, కారోబార్ బాలకృష్ణ, వాటర్‌మ్యాన్ శివ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో వివేకా విద్యాభారతి స్కూల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో ఆమనగల్లు వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందారు. ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం శంకర్‌పల్లిలో నిర్వహించారు. కడ్తాల జోనల్ నుంచి ఆమనగల్లు వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు పాల్గొని మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. డీఈవో సుశీందర్‌రావు, సీఐ వీరబాబులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, టీచర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

బీఎస్పీ షాద్‌నగర్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్



షాద్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా కేశంపేట మండలం కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రమేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సొంటె శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు కృషి చేసిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో నర్సింహ, రాంప్రసాద్‌గౌడ్, రాములు, ఆశీర్వాదం, మోజెస్ లింగం, కుమార్, హరికుమార్, మహేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం

శంషాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ మండల తహసీల్దారు దత్తు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. సర్వే నెంబర్ 421/1, 421/2 పరిధిలో కొంతమంది భూకబ్జా చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఆర్ఐలను పంపి అక్కడ పనులు జరగకుండా అడ్డుకున్నామన్నారు. బోర్డును తిరిగి తొలగించారని ఫోన్లో సమాచారం అందడంతో సిబ్బందిని పంపి తిరిగి బోర్డు ఏర్పాటు చేయించామన్నారు. ఈ భూమిని త్వరలో సర్వే చేయించి ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీచర్ల అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇచ్చిన డిప్యుటేషన్లను రద్దు చేసి ఉపాధ్యాయులను పనిచేస్తున్న ప్రాంతాలకు పంపించాలని సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంతుక శంకర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం శంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో అక్రమంగా ఇచ్చిన డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆమనగల్లు జడ్పీహెచ్ఎస్‌లో పీఈటీ జ్యోతిని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటి అన్నారంనకు, కడ్తాల మండలం రావిచెడ్ జడ్పీహెచ్ఎస్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు శ్రీదేవిని సరూర్‌నగర్ మండలం కర్మాన్‌ఘాట్ జడ్పీహెచ్ఎస్‌కు పంపించినట్లు తెలిపారు. రావిచెడ్ స్కూల్లో సాంఘిక శాస్త్రం బోధించడానికి టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారని, ఆమనగల్లులో పీఈటీ లేక క్రీడల్లో రాణించలేకపోతున్నారని చెప్పారు. అవసరమైతే డిప్యుటేషన్ ఇచ్చిన చోట ఉపాధ్యాయులు అవసరముంటే విద్యా వలంటీర్లను నియమించుకోవాలే తప్ప అక్రమంగా డిప్యుటేషన్లు ఇవ్వడం తగదన్నారు.